
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు



గురువారం 20 మార్చి 2025

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:23 (గురువారం సాయంత్రం) సహర్: 5:04 (శుక్రవారం ఉదయం)

### మొక్కలను సంరక్షించాలి

వేమనపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎండలు ఎక్కువగా ఉన్నందున నర్సరీల్లోని మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని ఎంపీడీవో కుమారస్వామి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముల్కలపేట, దస్నాపూర్ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో నీడ కోసం గ్రీన్‌మ్యాట్‌లను ఏర్పాటు చేయాలని, ప్రతీరోజు మొక్కలకు సమృద్ధిగా నీరు పట్టాలన్నారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అనంతరం కాంపౌండ్ వాల్, పశువుల పాకల నిర్మాణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం వేమనపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. సమస్య ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతో పాటు విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

### చెదిరిన గిజిగాడి గూళ్లు

● నేడు ప్రపంచ పిచ్చుకల సంరక్షణ దినోత్సవం 7

# ఎస్సీ సంక్షేమానికి పెద్దపీట

● రూ. 40,232 కోట్లు కేటాయింపు

● విద్య, వైద్య రంగాలకు పెరిగిన పద్దు

● బీసీ సంక్షేమానికి అరకొర నిధులు

● రాష్ట్ర బడ్జెట్‌పై భిన్న స్వరాలు



బడ్జెట్‌లో కేటాయింపులు (రూ. కోట్లలో)..

| | |
|---|---|
| ఎస్సీ సంక్షేమం | - 40,232 |
| ఎస్టీ సంక్షేమం | - 17,169 |
| బీసీ సంక్షేమం | - 11,405 |
| మైనార్టీ సంక్షేమం | - 3,591 |
| పంచాయతీరాజ్ శాఖ | - 31,605 |
| వ్యవసాయం | - 24,439 |
| విద్యాశాఖ | - 23,108 |
| వైద్యశాఖ | - 12,393 |
| విద్యుత్‌రంగం | - 21,221 |

మంచిర్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను బుధవారం ప్రవేశపెట్టారు. రూ. 3,04,965 కోట్లతో బడ్జెట్‌ను ప్రకటించగా ఎస్సీ సంక్షేమానికి అత్యధికంగా రూ. 40,232 కోట్లు కేటాయించింది. రాజీవ్ గాంధీ యువ వికాసం పథకంలో భాగంగా ఎస్సీ సామాజికవర్గాలకు వివిధయూనిట్లు కేటాయించేందుకు భారీ మొత్తంలో బడ్జెట్ కేటాయింపులు జరిగాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటున్న బడ్జెట్ మరికొన్ని వర్గాలను నిరాశలో ముంచింది. జిల్లాకు ప్రత్యేకంగా నిధుల ప్రస్తావన లేకపోవడం ఒకింత నిరాశపరిచింది.

● విద్య, వైద్య రంగాలకు..

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రజలకు కనీస అవసరాలైన విద్య, వైద్యానికి గత సంవత్సరంతో పోల్చితే కొంత మేర బడ్జెట్ పెరిగింది. విద్యారంగానికి రూ. 23,108 కోట్లు కేటాయించగా, గత ఏడాదికంటే స్వల్పంగా బడ్జెట్ పెరిగింది. విద్యా రంగానికి గత ఏడాది రూ. 21,389 కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం అదనంగా రూ. 1,719 కోట్లు కేటాయించారు. వైద్య రంగానికి రూ. 12,393 కోట్లు కేటాయించారు. ఇది గత సంవత్సరం బడ్జెట్ కన్నా రూ.893 కోట్లు అధికం. ఆయారంగాలకు బడ్జెట్ కేటాయింపులు సరిపడా జరగలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

(బడ్జెట్‌పై అభిప్రాయాలు 7లో)

### పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి: డీఈవో

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్న పరీక్షల కోసం జిల్లాలో 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 4730 మంది బాలురు, 4468 మంది బాలికలు, గతంలో అనుత్తీర్ణులైన 221 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ఎవరికైనా సందేహాలుంటే కంట్రోల్ రూమ్ నంబర్ 7032463114, 9440688034లో సంప్రదించాలని డీఈవో సూచించారు.

### సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీసు దర్బార్

● రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా



పోలీసు దర్బార్‌లో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

మంచిర్యాల క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీసు దర్బార్ నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీసు కమీషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం పోలీసు దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. వినతులను తీసుకొని సమస్యలను వెంటనే పరిష్కారించే విధంగా చూస్తానన్నారు. దర్బార్‌లో చెప్పడం ఇబ్బందిగా ఉంటే ఆఫీసుకు వచ్చి నేరుగా సమస్యలు విన్నవించుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కొన్ని సందర్భాల్లో ఒత్తిళ్లు తట్టుకోలేక క్షణికావేశంలో త ప్పుడు నిర్ణయాలు తీసుకునే వారు ఒక్కసారి తమ కుటుంబాల గురించి ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

### సీఎంను కలిసిన ఎమ్మెల్యే, నాయకులు

బెల్లంపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల అనంతరం బుధవారం ఎమ్మెల్యే వినోద్, కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరే విధంగా బడ్జెట్ రూపొందించాలని సీఎంతో మాట్లాడారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వినోద్ సమక్షంలో నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీఎంను కోరారు. అభివృద్ధి విషయంపై సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దావ రమేశ్, కారుకూరి రాంచందర్, గట్టు మురళీధర్‌రావు, పాల్గొన్నారు.

# సాగుకు సహాయం అందిస్తాం

● కలెక్టర్ కుమార్ దీపక్



శివ్వారంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ రంగంలో పంట సాగుకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సుందిళ్ల బ్యారేజీ శివ్వారం గ్రామ సమీపంలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణలతో కలిసి పర్యటించారు. రైతులతో వ్యవసాయ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటసాగుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ఉపాధిహామీ పథకం, ఇతర నిధుల ద్వారా మంజూరైన అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఎల్ఆర్ఎస్ రుసుము, ఆస్తి పన్నులవసూలు అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఆస్తి పన్నులను వంద శాతం వసూలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, ఎస్ఐ నాగరాజు, ఎంపీవో బాలయ్య, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

#### తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

**భీమారం :** వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం మండలంలోని దాంపూర్ గ్రామంలో పర్యటించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రణాళిక బద్ధంగా నిరంతరం తాగునీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ బస్సీలాల్, ఎంపీడీవో మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

#### చివరి ఆయకట్టుకు సాగునీరందించాలి

**మంచిర్యాల కలెక్టరేట్ :** జిల్లాలోని ప్రాజెక్టుల కింద సాగు చేయబడే చివరి ఆయ కట్టు వరకు పంటల సాగుకు నీరందించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ 11.4 టీఎంసీ ఉందని, కార్యాచరణ ప్రకారం నీటిని విడుదల చేస్తామన్నారు. సుందిల్ల, అన్నారం, గూడెం ఎత్తిపోతలు, ఇతర మధ్యచిన్న తరహా ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, నీల్వాయి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జూన్ 15 వరకు జిల్లాలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో సాగునీరు, తాగునీరుఉ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

### మేకల సంత వేలం పాట

తాండూర్, మార్చి 19 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని మేకల వార సంతకు బుధవారం డీఎల్‌పీవో సప్దర్‌ఆలీ, సీఐ కుమారస్వామి పర్య వేక్షణలో వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో 18మంది పాల్గొనగా దేవాపూర్‌కు చెందిన ఎల్లబోయిన సతీష్ రూ. 12.10 లక్షలకు మేకల వారసంత వేలంను దక్కించుకున్నాడు. కూరగాయల వేలానికి ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపో వడం తో వేలం పాటను వాయిదా వేశామ ని ఈనెల 24న మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి వేలం పాట నిర్వ హిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

### ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

నెన్నెల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు లాభదాయక మని ఏఈవో రాంచందర్ అన్నారు. మన్నెగూడంలో బుధవారం ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. నాటిన మూడో యేటనుంచే తోటలు కాపునకు వస్తాయని, ముప్పై ఏళ్ల వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఐదేళ్ల వరకు అంతర పంటల సాగు చేసుకోవచ్చని చెప్పారు. తోటల పెంపకానికి ప్రభుత్వ ఇచ్చే రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో కోరారు. చేళల్లో వేసవి దుక్కులు వేసుకోవాలని, వరికొయ్యలను కాల్చకుండా కలియదున్నుకోవాలని సూచించారు.

### బ్యాంకు ఖాతా వివరాలు అందజేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వెనకబడిన తరగతుల విద్యార్థులకు అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు తమ వాటాను పొందేందుకు తమ బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌బుక్ ప్రతులను ఈ నెల 21లోగా నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందజేయాలని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కళాశాల తమ లెటర్ హెడ్‌పై ఖాతా వివరాలతో పాటు స్టేట్‌మెంట్ ప్రతిని జత పర్చి అందించాలని తెలిపారు.

### రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జిజ్ఞాస పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

మంచిర్యాలక్రైం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జిజ్ఞాస పోటీల్లో మంచిర్యాల డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్‌సైన్స్ విభాగంలో సమర్పించిన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. కంప్యూటర్ సైన్స్ విభాగంలో కంప్యూటర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎండీ గులాం రసూల్ పర్యవేక్షణలో శ్రీహర్షవర్ధిని, సాహితి, సంధ్య, శ్రీనాథ్, రాజశేఖర్‌లు తెలుగు భాషా అభివృద్ధి అనే అంశంపై అధ్యయనం చేసి రాష్ట్ర స్థాయి పోటీకి పంపించగా ఈ నెల హైదరాబాద్‌లో రాష్ట్ర జిజ్ఞాస పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వీరికి పారితోషికంగా 18వేలను కళాశాల విద్యాశాఖ అందించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చక్రపాణి అధ్యాపకులు వీరిని అభినందించారు.

### పరిశుభ్రతపై అవగాహన

వేమనపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల లోని విద్యార్థినులకు జిల్లా మహిళ సాధికారత కేంద్రం అధికారులు పరిశుభ్రతపై బుధవారం అవగాహన కల్పించారు. బాలికలు పాటించాల్సిన ఆహార నియమాలు, నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియజేశారు. బాలికలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, మహిళ సాధికారత జెండర్ స్పెషలిస్టు విజయ, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు లిప్సిక, సూపర్ వైజర్ సువర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

కోటపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కోటపల్లి మండల అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత మొదటిసారిగా బుధవారం కోటపల్లి వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో ఇళ్లు కోల్పోయిన వంద మంది నిరుపేదలు నేటి వరకు సహాయం అందక ఎదురు చూస్తున్నారన్నారు. ఎన్నికల ముందే నోటిఫికేషన్ జారీ అయినా నేటి వరకు పారుపెల్లి మండలం ఏర్పాటు కాలేదన్నారు. మండలంలోని అనేక గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు, అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులతో 'ఒకే దేశం ఒకే ఎన్నిక'పై వర్క్‌షాపు నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, మండల ఇన్‌చార్జీ నాగేశ్వర్‌రావు, సీనియర్ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, మండల నాయకులు నర్సింహులు, కందుల వెంకటేష్, రాళ్లబండి శ్యాంసుందర్, పెద్దింటి లక్ష్మణ్, రాకేష్, రాజేష్, నవీన్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాలను కొనుగోలు చేయవద్దు



వెంకటాపూర్‌లోని ఇళ్లలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తాండూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దని తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని రేచిని గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సీజన్ ప్రారంభం కాకముందే కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి గ్రామాల్లో ప్రభుత్వ నిషేధిత నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారని వాటిని రైతులు కొనుగోలు చేయవద్దన్నారు. నకిలీ పత్తి విత్తనాలు వాడితే రైతులు నష్టపోతారని తెలిపారు. ప్రభుత్వం ఆమోదం పొందిన లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, కొన్న వాటికి రశీదులు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, రైతులు పాల్గొన్నారు.

**కన్నెపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):** రైతులు నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దని కన్నెపల్లి పోలీసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో నకిలీ విత్తనాలు విక్రయించే పాత నేరస్తులైన ఫున్నపురెడ్డి చందు, పుట్ట అశోక్ ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, పోలీసులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



డిప్యూటీ డీఎంహెచ్‌వో అనితకు వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

నస్పూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా విద్యాధికారి యాదయ్యలకు అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, కార్యదర్శి ఎండీ రఫీయా, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్ మాట్లాడుతూ బడ్జెట్‌లో కార్మికులకు వేతనాలను నిర్ణయించి చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను, బిల్లులను చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 10వేల వేతనం అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వవద్దన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు భాగ్య, మధునమ్మ, మల్లమ్మ, కళావతి, గురువక్క, గట్టక్క, మంజుల, సీఐటీయూ నాయకులు దూలం శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

#### ఫిక్స్‌డ్ వేతనం అందజేయాలని ఆశా వర్కర్లు..

నస్పూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. అంతకు ముందు కలెక్టరేట్‌కు ఊరేగింపుగా తరలివచ్చారు. ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఆశలు నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటి డీఎంహెచ్‌వో అనితకు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సోమిడి సమ్మక్క, శోభ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ. 18వేలను చెల్లించాలన్నారు. ఆందోళనలో రాణి, కవిత, అరుంధతి, సుజాత, సువర్ణ, సీఐటీ యూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్, నాయకులు దూలం శ్రీనివాస్, అంబటి లక్ష్మణ్ పాల్గొన్నారు.

### లాంగ్‌వాల్ ప్రాజెక్టును రద్దుచేయాలి

బెల్లంపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): శాంతిఖనిగని లాంగ్‌వాల్ ప్రాజెక్టును రద్దు చేయాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లోసీఅండ్ఎండీ బల్‌రాం నాయక్‌కు ప్రభావిత గ్రామాల ప్రజలు రైతులు వినతి పత్రం అందజేశారు.లాంగ్‌వాల్ ప్రాజెక్టు ద్వారా ఎన్నో గ్రామాల రైతులకు, ప్రజలకు ఇబ్బందులకు ఎదురవుతాయని వినతిలో పేర్కొన్నారు. వేల మంది రైతులు వ్యవసాయాన్ని జీవనాధారంగా జీవనం సాగిస్తున్నారని, లాంగ్‌వాల్ ప్రాజెక్టుతో భూగర్భజలాలు దెబ్బతిని సాగుకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిసర గ్రామాల్లో వాతావరణ కాలుష్యం ఏర్పడి గ్రామస్తులకు అనారోగ్య సమస్యలు ఏర్పడుతాయన్నారు. లాంగ్‌వాల్ ప్రాజెక్టును రద్దు చేయాలని పేర్కొన్నారు.

## పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు

ఆసిఫాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో నిర్వహించే పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. స్థానికంగా బుధవారం ఆయన మాట్లాడారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్టు అమలులో ఉంటుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 6,779 మంది విద్యార్థులకు 36 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండకూడదన్నారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించొద్దని తెలిపారు పరీక్ష సమయంలో పరిసరాల్లో ఇంటర్నెట్ సెంటర్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసి ఉంచాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

ఆసిఫాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు ఆందోళన చేశారు. కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. అధికారులు ఎవ్వరు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆశా వర్కర్లకు మధ్య కొద్ది సేపు తోపులాట జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్యలను చర్చించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేల వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, శ్రీకాంత్, కృష్ణమాచారి, స్వరూప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## వంద రోజులు పని కల్పించాలి

వాంకిడి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి వంద రోజుల పని కల్పించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. వాంకిడి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ వంద రోజుల పని కల్పించాలని చెప్పారు. పని ప్రదేశంలో కనీస వసతులు ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. నర్సరీల్లో పూర్తి స్థాయిలో జర్మినేషన్ ఉండేలా చూడాలని, విత్తనాలు మొలకెత్తని చోట నారు తెప్పించాలని, ఎండలు పెరుగుతున్న దృష్ట్యా అన్ని నర్సరీల్లో గ్రీన్ నెట్ ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ఏపీఓ శ్రావణ్‌కుమార్, ఈసీ మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫైనాన్స్ కంపెనీకి రూ.1.39 కోట్ల టోకరా



మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాల క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని నిర్వహిస్తున్న ఓ ఫైనాన్స్ కంపెనీకి అందులో పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులు కోటి 39 లక్షల 90 వేల రూపాయలు మోసగించారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ బుధవారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. చోళా మండలం ఇన్వెస్టిమెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌లో పని చేస్తున్న బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, కరీంనగర్ ఏరియాలో ఏసీఎంగా పనిచేస్తున్న చిట్టేటి అశోక్‌రెడ్డి కత్తెరశాలకు చెందిన చనిపోయిన వారి పేర్ల మీద లోన్‌లు తీసుకొని సొంతానికి వాడుకున్నారు. ఈ మేరకు జనవరి 9న కంపెనీ లీగల్ మేనేజర్ గగన్‌దీప్ అగర్వాల్ ఫిర్యాదు మేరకు సీఐ ప్రమోద్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఇందులో కిష్టంపేట గ్రామానికి చెందిన చేపెల్లి సమ్మయ్య, చల్ల రామయ్య, చేపల్లి చిన్న బక్కయ్య, దోమల సారమ్మ, చల్ల రవీందర్, బొజ్జ మల్లయ్యతో పాటు మరికొందరి పేర్ల మీద కోటి 39లక్షల 90వేల రూపాయల లోన్ తీసుకొని సొంతానికి వాడుకున్నారని తేలింది. దీంతో ఈ కేసులో ప్రవీణ్‌రెడ్డిని అరెస్టు చేశారు. ఇంకా వీరికి చాలా మంది సహకరించారని దర్యాప్తు అనంతరం వారిని కూడా అరెస్టు చేస్తామని ఏసీపీ తెలిపారు.

# కూల్..కూల్‌గా..

- జోరుగా కూలర్ల విక్రయాలు
- జిల్లాలో 42 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో ప్రజల అవస్థలు



వాంకిడిలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన కూలర్లు

వాంకిడి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు సెగ పుట్టిస్తున్నాయి. ఉదయం 10 గంటలు దాటితే బయటకు రావడానికి జంకుతున్నారు. కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగాయి. ఫ్యాన్ కింద కూర్చున్నా ఉక్కపోతే. దీంతో ప్రజలు ఏసీలు, కూలర్లవైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది మార్చి మొదటి వారం నుంచే ఎండల తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు కూలర్ల కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే 42డిగ్రీల ఉష్ణోగ్రతలకు చేరువయ్యాయి. ఎండాకాలం అనగానే మనందరికి గుర్తొచ్చేవి కూలర్లే.. ఎండ నుంచి ఉపశమనానికి, వేసవి తాపం నుంచి రక్షణకు ప్రతి ఇంట్లో కూలర్ తప్పనిసరిగా ఉండాల్సిందే. వేసవికాలం ప్రారంభం కావడంతో మండలంలో కూలర్ల విక్రయాలు ఊపందుకున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. భానుడి ప్రతాపానికి ఉక్క పోత నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు కూలర్ల కొగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వాంకిడి మండలంలోని పలు ఎలక్ట్రికల్ దుకాణాల్లో ఇప్పటికే వ్యాపారులు కూలర్లను అందుబాటులో ఉంచారు. వీటి ధర నాణ్యతను బట్టి రూ. 2000 నుంచి రూ. 6వేల వరకు అందుబాటులో ఉన్నాయి. ఇక కంపెనీ కూలర్లు 20వేల రూపాయల వరకు ఉన్నట్లు చెబుతున్నారు.ఫైబర్, ఇనుప కూలర్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.



మరమ్మతులు చేస్తున్న యువకుడు

### ఎక్కడ చూసినా కూలర్ల దుకాణాలే..

ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌తో పాటు మండలకేంద్రాల్లోనూ కూలర్ల దుకాణాలు కనిపి స్తున్నాయి. కుమరం భీం జిల్లా రెబ్బెన, మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి కూలర్లను వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. సీజన్‌లో సుమారు ఒక్కో దుకాణంలో రెండు వందల కూలర్లకు పైగా అమ్మకాలు ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. మండల కేంద్రంలోని ప్రజలతో పాటు మారు మూల గ్రామాల నుంచి వచ్చే ప్రజలు కూలర్లను కొనుగోలు చేస్తుంటారని వ్యాపారులు తెలిపారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో వరుడికి సైతం కూలర్ అందజేస్తుండడంతో వేసవికాలంలో కూలర్‌లకు డిమాండ్ అధికంగా ఉంటుందని తెలుపుతున్నారు. టేబుల్‌పై ఉంచుకునే పర్సనల్ కూలర్‌తోపాటు పెళ్లిళ్ల సందర్భంగా ఫంక్షన్‌హాళ్లలో, హోటళ్లలోవినియోగించే జంబో కూలర్లు మార్కెట్‌లో ఉన్నాయి.

### మూడు నెలలే వ్యాపారం..

వేసవి కాలంలో మార్చి, ఏప్రిల్, మే నెల ల్లోనే కూలర్ల వ్యాపారం జోరుగా సాగుతుంది. పాతవి మరమ్మతులు చేయడమైనా ఈ కాలంలోనే యువతకు ఉపాధి దొరుకుతుంది. దుకాణాల్లోనూ వేసవిలో మరమ్మతుల కోసం ప్రత్యేకంగా యువకులను మూడు నెలల పాటు పని చేసేందుకు నియమించుకుంటారు. జిల్లా వ్యాప్తంగా ఇనుప, ఫైబర్ కూలర్‌ల విక్రయాలతో పాటు పాత కూలర్‌ల మరమ్మతులు కూడా చేస్తున్నారు. పాత కూలర్‌లకు అవసరమైన ముడి సరకులను అందుబాటులో ఉంచుకుని పాత కూలర్లను మరమ్మతులు చేసి ప్రజలకు అందిస్తున్నారు. ఐరన్ షీట్స్ పంపులు, మోటర్, గడ్డి, స్విచ్‌లు, వాటర్‌సప్లై చేసే పైపు లు, కూలర్ ఫ్యాన్ రెక్కలు, అందుబాటులో ఉంచి కూలర్‌లను మరమ్మతులు చేసి అందిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

### వేసవిలోనే ఉపాధి..:



**సైఫ్‌ఖాన్, వ్యాపారి**

ఏటా వేసవిలోనే ఉపాధి దొరుకుతుంది. మిగితా కాలాల్లో అంతంత మాత్రంగానే పనులు ఉన్నాయి. ఎండాకాలంలో ఒక్కో దుకాణంలో రెండు వందలకు పైగా కూలర్ల వ్యాపారం జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి కొనుగోలు కోసం వచ్చే ప్రజలకు అందుబాటు ధరల్లోనే కూలర్లు తెప్పిస్తున్నాం. కొత్త ఐరన్, ఫైబర్ కూలర్లతో పాటు పాత కూలర్లకు గడ్డి, ఇతర ముడిసరకులు వేసి మరమ్మతులు చేసి ఇస్తుంటాం.

## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

**ఇస్లావత్ నరేష్, చింతలమానేపల్లి ఎస్సై**



**ఆంధ్రజ్యోతి:** మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

**ఎస్సై:** మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది చేత గస్తీ చేపడుతూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

**ఎస్సై:** రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు ధరించాలని సూచిస్తున్నాం. వాహన తనిఖీల్లో నిబంధనలు పాటించని వారికి జరిమానా విధిస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడుపకూడదని చెబుతున్నాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ఆంధ్రజ్యోతి:** యువత వ్యసనాల బారిన పడకుండా ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**ఎస్సై:** యువకులు వ్యసనాలకు అలవాటు కావద్దని చెబుతున్నాం. చదువుపై దృష్టి సారిస్తే ఉన్నత అవకాశాలు లభిస్తాయి. చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తి చూపాలి. ఇప్ప టికే అన్ని గ్రామాల్లో పోలీసులు- మీ కోసం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్ర మాలు చేపడుతున్నాం. యువకులు ఆటలపై దృష్టి పెట్టేలా క్రీడా కిట్లు ఇస్తున్నాం.

- చింతలమానేపల్లి, ఆంధ్రజ్యోతి

## ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు

జైనూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సేవలతోనే ప్రజల్లో గుర్తింపు ఉంటుం దని మండల సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్ అన్నారు. స్థానిక బాలిక ఆశ్రమోన్నత పాఠశాలలో మండలంలోని సుకుడ్‌పెల్లి ఉపాధ్యాయురాలు కాత్లె పారుపాబాయి, ఈర్పగూడ హెచ్‌ఎంలు గాడాం రతన్‌లకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్ మాట్లాడుతు పారుబాయి, గేడాం రతన్‌లు తమ వృత్తి ధర్మాన్ని చక్కగా నిర్వర్తించి గొప్ప పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉపాధ్యా యులను జైనూరు స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పార్వతీబాయి, ఉపాధ్యాయులు కోట్నాక భీంరావ్, కోట్నాక బూదుబాయి, మాజీ ఎంపీటీసీ కుంర భగ్వంత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్‌లో ఆస్తి పన్ను వసూళ్ల వేగవంతం

ఆసిఫాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పన్నుల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పట్టణంలోని బ్రాహ్మణవాడలో మున్సిపాలిటీ అధికారి రవికుమార్, సిబ్బంది ఉదయ్‌కుమార్ ఇంటింటికి తిరుగుతూ ఇంటి పన్నులు వసూలు చేశారు. ఇళ్ల వద్దకు అధికారులు రావడంతో యజమానుల సహకరిస్తూ పన్నులు చెల్లిస్తున్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వెనకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి సాధించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సజీవన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఏప్రిల్ 5 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సూచించారు.

# విద్యార్థినులకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో బుధవారం వచ్చే ఆర్థిక సంవత్సరంలో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖ ల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో బేటీబచావో- బేటీ పడావో కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేసేందుకు కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో బాల సభలు నిర్వహించాల న్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలో బాలికల విద్య ప్రాముఖ్యత తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రక్తహీనత, పోషకాహార లోపాలు గల బాలికలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. విద్యా ర్థినులు చదువులో రాణించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖాధికారి భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం, డీపీవో ఉమ ర్ హుస్సేన్, జిల్లా బాలల సంరక్షణాధికారి మహేష్, సీడీపీవో రేణుక, జిల్లా మహిళా సాధి కారత సమన్వయకర్త శారద, సభ్యులు మమత, రాణి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### భోజనంలో మెనూ పాటించాలి

**ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు అందించే భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మోతుగూడ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. తరగతి గదులు, వంట శాల, మూత్రశాలలు, మధ్యాహ్న భోజనం, నిత్యావసర సరుకుల నాణ్యత, రిజిస్టర్లను తనిఖీ చేశారు. తరగతి గదులు, వంట శాల, మూత్రశాలలు పరిశుభ్రం గా ఉంచాలని చెప్పారు. పరిసరాలను పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.

- ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపల్ కమిషనర్ రత్నం భుజంగరావు, ఎంపీడీవో, పట్టణ ప్రణాళికాధికారి యశ్వంత్‌కుమార్‌లతో ఎల్‌ఆర్‌ఎస్ రుసుం వసూలుపై బుధవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణ, పీటీఎస్ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెన్నెల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని గడ్డిమందు తాగిన భర్త చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. నెన్నెల ఎస్సై ప్రసాద్ కథనం ప్రకారం.. చిత్తాపూర్‌కు చెందిన మగ్గిడి రాజ్‌కుమార్ (25)కు 2018లో మంచిర్యాలకు లావణ్యతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కొడు కులు ఉన్నారు. మద్యానికి బానిసైన రాజ్‌కుమార్ ప్రతినిత్యం తాగివచ్చి భార్యతో గొడవపడేవాడు. గొడవ జరిగినపుపడల్లా భార్య తల్లిగారింటికి వెళ్లిపోయేది. కొన్నాళ్లకు ఇక పైన తాగనని మాటిచ్చి భార్యను తీసుకొని వచ్చేవాడు. మరోసారి ఈ నెల 14న తాగి వచ్చిన రాజ్‌కుమార్ భార్యను కొట్టడంతో ఇక తాను కాపురానికి రానని తెగేసి చెప్పిన లావణ్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇక తన భార్య రాదనే బాధతో మరింత ఎక్కువ మద్యం తాగేవాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంట్లోనే గడ్డిమందు తాగాడు. సోదరుడు ప్రసాద్ గమనించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. రాజ్‌కుమార్ తల్లి బాలక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## బీసీ లైజన్ అధికారికి సన్మానం

శ్రీరాంపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ లైజన్ అధికారిగా నియమితులైన ఎస్ ఓ టు జీఎం సత్యనారాయణను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఆయన చాంబర్‌లో సన్మానించారు. కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చన్న, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాలతో యువతకు ఉపాధి



నియామకపత్రం అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాలతో యువతకు ఉపాధి లభిస్తోందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. జీఎం కార్యాలయంలో పలువురు యవతీయువకులకు బుధవారం నియామకపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సింగరేణి ప్రగతిలో ఎంతో ముందుందని తెలిపారు. దానికి అనుగుణంగా ప్రతి ఉద్యోగి రక్షణతో కూడిన బొగ్గును ఉత్పత్తి చేయాలని సూచించారు. నూతన ఉద్యోగులు సీనియర్ కార్మికుల సూచనలు తీసుకోవాలన్నారు. ర్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### భయం వీడితేనే పరీక్షల్లో విజయం

పదో తరగతి విద్యార్థులు భయం వీడితే పదో తరగతి పరీక్షల్లో విజయం సాధిస్తారని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. పదో తరగతి వీడ్కోలు సమావేశం సందర్భంగా సీసీసీలోని సింగరేణి పాఠశాలలో వేడుకలలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు చేరుకోవాలంటే ఉపాధ్యా యులు, పెద్దల సలహాలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టికెట్లు, స్టడీ మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడ విష్ణువర్ధన్ రావు, హెచ్‌ఎం సంతోష్‌పాల్గొన్నారు.

### వార్షికోత్సవ ఏర్పాట్లు పరిశీలన

సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల 17వ వార్షికోత్సవ ఏర్పాట్లను జీఎం ఎం. శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈ నెల 22న నిర్వహించే ఉత్సవాలకు సీఎండీ ఎన్. బలరాం, డైరెక్టర్లు సత్యనారాయణ రావు, ఎల్‌వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు హాజరు కానున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం మెస్‌లోని ఆహారపదార్థాలను ఆయన స్వ యంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహస్వామి, డీజీఎం (వర్క్‌షాప్) రవీందర్, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, కరస్పాండెంట్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్షణను గాలికి వదిలేసిన యాజమాన్యం

శ్రీరాంపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఏరియాలోని స్టోర్స్ యాజమాన్యం రక్షణను గాలికి వదిలేసిందని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా అన్నారు. ఏరియా స్టోర్స్‌ను బుధవారం వారు సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. షెడ్లలో ఎలక్ట్రికల్ వైరింగ్ అస్తవ్యస్తంగా ఉందని, దీనివల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్టోర్స్‌లో వందల టన్నుల మెటీరియల్, యాంత్ర పరికరాలు, ఇతర వసువులు అన్‌లోడ్ చేస్తారని వీటికోసం టెండాల్ సూపర్‌వైజర్‌ను నియమించాలని కోరారు. నాణ్యతలేని మెటీరియల్ అందిస్తున్నారని ఆరోపించారు. వర్క్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సమావేశాలు ఏర్పాటు అస్తవ్యస్తంగా ఉన్న స్టోర్స్ నిర్వహణను సరైన గాడిలో పెట్టాలని జీఎంను కోరారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శులు కుమారస్వామి, ఎడ్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు క్వార్టర్ల కేటాయింపు

మందమర్రిటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు పారదర్శకంగా ఎన్‌సీడబ్ల్యూఏ క్వార్టర్ల కేటాయిస్తున్నామని ఎస్‌వో టూ జీఎం విజయ్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్‌లు తెలిపారు. బుధవారం సీఈఆర్ క్లబ్‌లో క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో రాజన్న, మైత్రేయబంధు, రాజలింగు పాల్గొన్నారు.





## కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



యూనియన్‌లో చేరిన వారికి కండువా వేస్తున్న సీతారామయ్య

మందమర్రిటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. కేకే 5 గనిపై బుధవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులకు సంబంధించి ఈ నెల 7న హైదరాబాద్‌లో సీఎండీ బలరాం సమక్షంలో నిర్వహించిన స్ట్రక్చర్ సమావేశంలో పలు కీలక డిమాండ్లపై చర్చించి ఒప్పించామని అన్నారు. కార్మికులకు ఏమి చేయని ఐఎన్‌టీయూసీ తమ యూనియన్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని ఐఎన్‌టీయూసీ నాయ కులు చేస్తున్న పైరవీలు అందరికి తెలుసన్నారు. రాష్ట్రంలో వారి ప్రభుత్వమే అధికారంలో ఉంటే రాష్ట్రంలో నూతన గనులను ఎందుకు సాధించడం లేదో జవాబు చెప్పాలన్నారు. సింగరేణి భవిష్యత్ కోసం సత్తుపల్లి, ఇల్లెందు గనుల కోసం టెండర్లలో పాల్గొనవద్దని చెప్పిందని, ఈ టెండర్లును రద్దు చేయాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. టెండర్లలో సింగరేణి పాల్గొని గనులను దక్కించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలువురు కార్మికులు యూనియన్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్,గని ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాధుని సుదర్శన్,నాయకులు రాజేశం, విక్రమ్‌సింగ్, బానయ్య, సురేష్, మేకల సంతు, శ్రీకాంత్, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతతోనే 'పది'లో విజయం

- డీఈవో యాదయ్య



నస్పూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాస్తే విజయం సొంతం అవుతుందని మంచిర్యాల డీఈవో యాదయ్య 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ఆంధ్రజ్యోతి:** పదో తరగతి పరీక్షలో కొత్తగా ఈ ఏడాదిలో ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి?

**డీఈవో:** ఈ సంవత్సరం కొత్త విధానాలు అమల్లోకి వచ్చాయి. విద్యార్థులకు గతంలో నాలుగు పేజీల బుక్‌లెట్ ఇచ్చేవారు. ప్రస్తుతం సమయం వృథా కాకుండా ఈ ఏడాది కొత్తగా 24 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నాము. ఇది వరకు ఫిజికల్ సైన్స్, బయో సైన్స్ పరీక్షలు ఒకే రోజు నిర్వహించారు. కానీ ఈ సంవత్సరం ఫిజికల్ సైన్స్, బయో సైన్స్ పరీక్షలను వేర్వేరు రోజుల్లో జరుగనున్నాయి.

**ఆంధ్రజ్యోతి:** పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సదుపాయాలు ఏర్పాటు చేశారు?

**డీఈవో:** వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని పరీక్ష కేంద్రాల వద్ద చల్లని మంచినీటిని ఏర్పాటు చేశాం. ప్రతీ సెంటర్ వద్ద ఏఎన్ఎం అందుబాటులో ఉంటారు. ఇతర మందులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తారు. పరీక్ష కేంద్రాలకు వచ్చిపోయే సమయాల్లో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సెంటర్‌లో కుర్చీలు, బెంచీలు, ఫ్యాన్లు, తగినంతా పర్నీచర్ ఉన్న సెంటర్లను మాత్రమే ఈసారి ఎంపిక చేశాం. అన్ని సెంటర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాము.

**ఆంధ్రజ్యోతి:** పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎంత మంది, ఎన్ని సెంటర్లు ఏర్పాటు చేశారు?

**డీఈవో:** జిల్లాలోని 370 పాఠశాలలకు చెందిన 9,189 రెగ్యూలర్ విద్యార్థులతో పాటు మరో 210 మంది, మొత్తం 9410 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందులో బాలురు 4,725 మంది, బాలికలు 4,464 మంది ఉన్నారు. 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాము. 49 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 49 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, సెంటర్ కస్టోడియన్స్ నలుగురు, 461 మంది ఇన్విజిలేటర్లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 49 సిటింగ్ స్క్వాడ్స్‌లను నియమించాము.

**ఆంధ్రజ్యోతి:** తల్లిదండ్రులకు, విద్యార్థులకు మీరు ఇచ్చే సూచనలు?

**డీఈవో:** పదోతరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. ఒక రోజు ముందుగానే పరీక్ష కేంద్రం ఎక్కడ ఉన్నదో చూసుకోవాలి. పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలి. ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లో తీసుకురావద్దు. పరీక్షల సమయంలో విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంటే మంచిది. ప్రశాంతంగా చదువుపై దృష్టి సారించి ఒత్తిడికి లోను కాకుండా జాగ్రత్తగా ఉండాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఒత్తిడి పెట్టకుండా సున్నితంగా వ్యవహరించాలి. పిల్లలు చదువుపై దృష్టి పెట్టే విధంగా చూడాలి.

## గేట్‌లో మెరిసిన దౌడేపల్లి యువకుడు



అనుమాల్ల సదన్

లక్షెట్టిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలంలోని దౌడేపల్లి గ్రామానికి చెందిన అనుమాల్ల సదన్ గేట్‌లో ఆల్‌ఇండియాలో 74వ ర్యాంక్ సాధించాడు. సదన్ చిన్నత నంలోనే తండ్రి సత్యనారాయణ చనిపోవడంతో తల్లి జ్యోతి అన్నీ తానై చూసుకుంది. విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగించాడు. లక్షెట్టిపేట గురుకులంలో 5వ తగరతి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించాడు. పాలిటెక్నిక్ డిప్లొమా హైదరాబాద్ మసాబ్‌ట్యాంక్‌లోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో, బీటెక్ హైదరాబాద్‌లోని విజ్ఞానజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో చదివాడు.

## మత్స్యకారుడి మృతి

లక్షెట్టిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలకు చెందిన మేడి లింగయ్య(65) అనే మత్స్యకారుడు మృతి చెందినట్లు ఎస్సై సతీష్ తెలిపాడు. మృతుడు చేపలు పట్టుకుంటు జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా బుధవారం ఉదయం చేపలు పట్టేందుకు గోదావరికి వెల్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు గోదావరి వద్ద వెతుకగా ఒడ్డున చనిపోయి ఉన్నాడు. మృతుడి భార్య పద్మ తన భర్త మృతిపై ఎవరిపైనా అనుమానం లేదని మృతికి గల కారణం తెలుపగలరని పిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

## పాము కాటుకు గురైన బాలుడు

చెన్నూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన గల కేసీఆర్ పార్కులో ఇటీవల ఓ బాలుడు పాము కాటుకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోన లైన్‌గడ్డ కాలనీకి చెందిన సయ్యద్ సమీర్ అనే బాలుడు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 15న స్థానిక కేసీఆర్ పార్కుకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. అక్కడ ఆడుకుంటుండగా పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే బాలున్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. మంచిర్యాలలో చికిత్స పొందిన బాలుడు బుధవారం క్షేమంగా ఇంటికి రావడంతో కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు స్థానిక మున్సిపల్ అధికారులు పార్కును మూసివేసి పార్కు లోపల పనులు జరుగుతున్నట్లు అందుకే పార్కును మూసివేస్తున్నట్లు ఓ ఫ్లెక్సీని పార్కు ముందు ఏర్పాటు చేశారు. దీంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

# చెదిరిన గిజిగాడి గూళ్లు

- కనుమరుగవుతున్న పిచ్చుకలు
- కాలుష్యం, చెట్ల నరికివేతతో ముప్పు
- రక్షించకుంటే పర్యావరణానికి ముప్పేనంటున్న పక్షి ప్రేమికులు
- నేడు ప్రపంచ పిచ్చుకల సంరక్షణ దినోత్సవం



నస్పూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పల్లెను నిద్రలేపే పక్షులు, వాటి కిల కిలరావాలు పల్లె ప్రాంత వాసులకు మేలుకొలుపు. పక్షి జాతిలోనే చిన్న దైన పిచ్చుక పలకరిస్తుంటే ముచ్చట గొలుపుతుంది. ప్రతీ ఇంటా బంధువుల్లా మెలిగిన పిచ్చుకలు సాంకేతిక వ్యవస్థ విస్తరించడంతో వాటి జీవన విధ్వంసం మొదలైంది. పిచ్చుక జాతి నశిస్తే మానవ మనుగడకు ప్రమాద ఘంటికలు మోగినట్లేనని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ సమతుల్యాన్ని, జీవ వైవిధ్యాన్ని, సమగ్రతను కాపాడే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైన ఉన్నది. గురువారం ప్రపంచ పిచ్చుక సంరక్షణ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

### నేపథ్యం..

భారతీయ ప్రకృతి పరిరక్షకుడైన మహమ్మద్ దిలావార్ పిచ్చుకల పరిరక్షణ కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాడు. నేచర్ పర్ సొసైటీ అనే సంస్థను స్థాపించాడు. తద్వారా అనేక రకాలుగా పిచ్చుకలను రక్షించడానికి వీలైన అవకాశాల్ని అందరితో నూ పంచుకున్నారు. ఈ సందర్భంలో పిచ్చుకల మనుగడకు ప్రమాదం ఏర్పడితే మానవుల మనుగడకే ప్రమాదం అని గుర్తించిన ప్రపంచదేశాలు అంతరించిపోతున్న పిచ్చుకలను కాపాడుకొనేందుకు, వాటి మనుగడ కొనసాగి భావితరాలకువాటి ప్రాముఖ్యతను తెలిపేందుకు ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా నేచర్ ఫరెవర్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఫ్రాన్స్‌కు చెందిన ఎకో-సిస్ యాక్షన్ ఫౌండేషన్, ఇతర జాతీయ, అంతర్జాతీయ సంస్థల తోడ్పాటుతో పిచ్చుకల సంరక్షణ లక్ష్యంగా ఏటా మార్చి 20వ తేదీని పిచ్చుకల సంరక్షణ దినంగా ప్రపంచ వ్యాప్తంగా జరుపుతున్నారు. 2025 ప్రపంచ పిచ్చుకల థీమ్ 'ప్రకృతి చిన్న దూతలకు నివాళులు.'

### ఉనికికి ప్రమాదకరంగా..

జీవన శైలిలో పెనువేగంతో వచ్చిన అనేక మార్పుల కారణంగా పిచ్చుకపై బ్రహ్మాస్త్రంగా పరిణమిస్తోంది. పెరుగుతున్న పట్టణీకరణ అంతరించి పోతున్న పచ్చదనం, రసాయనాల వినియోగం, పండ్లు, ఆహార ధాన్యాల కొరత, వాటిపై పురుగు మందుల పిచికారి పిచ్చుక ఉనికికి ప్రమాదకరంగా మారుతున్నాయి. దీనికి తోడుగా విస్తరించిన సెల్ టవర్లు వాటి నుంచి వెలువబడుతున్న రేడియేషన్, అయస్కాంత తరంగాలు పెను ముప్పుగా తయారయ్యాయి. పూరిళ్లలో, ఇంటి అవరణలో తాత్కలికంగా వేసిన పందిళ్లకు వేలాడే వరి కంకులు, వాకిళ్లలో ఆరబోసిన చిరుధాన్యాలు పిచ్చుకలకు ప్రధానమైన ఆహారం. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు, సాగులో వచ్చిన కొత్త పోకడల మూలంగా చిరు ధాన్యం పండించడం తగ్గిపోయింది. దీంతో ఆహార కొరత కారణంగా అరుదైన పక్షి జాతులు, పిచ్చుకలు కూడా అంతరించిపోతున్నాయి. గ్రామాల్లో నేడు కిచకిచమంటూ పిచ్చుకల సంచారం మచ్చుకైనా కనిపించని పరిస్థితి దాపురించింది. పట్టణ ప్రాంతాల్లో వాహనాల నుంచి వచ్చే కార్బన్‌డైయాక్సైడ్, అపార్టుమెంట్లతో పిచ్చుక జాతి మనుగడ అంతరించిపోతోంది.

### ఇలా కాపాడుకుందాం...

- ఆయా ప్రాంతాల్లో ఏర్పాటుచేసే సెల్ టవర్లను జనావాసాలకు దూరంగా ఉండే విధంగా నియమ నిబంధనలను అమలు చేయాలి.
- వ్యవసాయ రంగంలో పంటలకు క్రిమి సంహారక మందుల వాడకం పూర్తిగా నియంత్రించాలి.
- వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించాలి.
- విద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ శాస్త్రవేత్తలు పిచ్చుకల సంరక్షణకు ప్రత్యేక చర్యలను చేపట్టాలి.

### ఇలా చేద్దాం..

- ప్రతి ఒక్కరూ పక్షుల పరిరక్షణకు బాధ్యతగా స్వీకరించాలి.
- ఎండ కాలంలో పిచ్చుకల దాహార్తిని తీర్చడానికి నీటి తొట్టిలను ఏర్పాటు చేయాలి.
- మొక్కలు, సహజ అడవులను పెంచాలి.
- పిచ్చుకల స్థావరాలను ఏర్పాటు చేయాలి.
- ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలి.
- విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి అవగాహన కల్పించాలి.
- విద్యాసంస్థల్లో పిచ్చుక జీవన విధానంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలను ఏర్పాటు చేసి వారిలో అవగాహన కల్పించాలి.

### గూడు అల్లికలో నైపుణ్యం..

అన్ని రకాల పక్షుల కంటే పిచ్చుక గూడు కట్టుకోవడంలో ప్రత్యేక ఉంది. ఈత చెట్టు, తాటి చెట్టు, బావుల అంచున తుమ్మ చెట్టు చివరన గడ్డి పోచలతో నైపుణ్యంగా గూడును అల్లుతాయి. పిచ్చుక గూళ్ల కట్టుకోవడంలో ఇంజనీర్లను తలదన్నే నైపుణ్యాన్ని కనబర్చుతాయి. వాతావరణాన్ని అంచనా వేసి పిచ్చుక తన నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. పిచ్చుక గూడు కింది భాగం నుంచి లోపలికి చేరుతుంది. గూడు మంచిగా ఉంటేనే మగ పిచ్చుకతో ఆడ పిచ్చుక జత కడుతుంది. గూడు లోపల వెచ్చదనంతో పాటుగా వానొచ్చినా చుక్క నీరు కూడా లోపలికి జారకుండా, తడవకుండా ఉంటుంది. చివరి అంచున కొమ్మలకు వేలాడుతున్న పక్షుల గూళ్ల ఎంత గాలి వచ్చినా పూర్తిస్థాయి రక్షణగా ఉంటాయి. పిచ్చుక ప్రకృతిలో తన దైన పాత్రను పోషించ డంతో పాటు క్రిమి కీటకాలను అదుపులో ఉంచడంలో కీలకంగా వ్యవహరిస్తోంది.







### అవగాహన కల్పించాలి.. గుండేటి యోగేశ్వర్, పర్యావరణ ప్రేమికుడు, నస్పూర్

వేసవిలో ప్రతి ఇంటి పరిసరాల్లో మట్టి పాత్రల్లో పిచ్చుకల దాహార్తి తీర్చడానికి నీటిని పెట్టాలి. ఆహారం కోసం ధాన్యపు గింజలను ఉంచాలి. పిచ్చుకల ఆవాసం కోసం వెదురు, అట్ట డబ్బాలతో తయారు చేసిన వాటిని గూళ్లగా ఏర్పాటు చేయాలి. చెరువులు, ఇతర నీటివనరుల వద్ద ఈత చెట్లను విరివిగా నాటాలి. పిచ్చుకల సంరక్షణ కోసం విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించాలి.

## ఎమ్మార్పీఎస్, బీసీ సంఘాల ఆధ్వర్యంలో సంబరాలు



మంచిర్యాలలో సంబరాలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్/జన్నారం/నస్పూర్ మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడంతో జిల్లాలో ఎమ్మార్పీఎస్, బీసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ, నాయకులు పాల్గొన్నారు. జన్నారంలో బీసీ సంఘం నాయకులు బస్టాండ్ సమీపంలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు. నస్పూర్ పట్టణంలోని సీసీసీ టౌన్‌షిప్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట జరిగిన వేడుకలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చుంచు శంకర్ వర్మ, నాయకులు పాల్గొన్నారు.

## సీఐఎస్ఎఫ్ జవాన్‌ల సేవలు అభినందనీయం



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ జవాన్‌లు

జైపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక రక్షణలో సీఐఎస్ఎఫ్ జవాన్‌ల సేవలు అభినందనీయమని ఎస్టీపీపీ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం సీఐఎస్ఎఫ్ రైసింగ్ డేను పురస్కరిం చుకుని ఎస్టీపీపీ ప్రధాన గేటు నుంచి పెగడపల్లి వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎస్టీపీపీ ఈడీ శ్రీనివాసులు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం..

**బెల్లంపల్లి:** అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో విద్యారంగానికి తీవ్రఅన్యాయం జరిగిందని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

**నస్పూర్:** ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు అర్హులైన అగ్రవర్ణ కులాల్లోని పేద నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాస్ పథకంలో అవకాశం కల్పించాలని కోరుతూ బుధవారం రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతి పత్రం అందజేశారు.

**శ్రీరాంపూర్:** వ్యాపారులు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఆయన వీధివ్యాపారులకు పలు సూచనలు చేశారు.

**శ్రీరాంపూర్:** సింగరేణి నియమించిన బీసీ లైజన్ అధికారులను ఉద్యోగులకు పరిచయం చేయాలని టీబీజీకేఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శ్రీరాంపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థలోని 11 డివిజన్లలో అధికారులను నియమించారని, అన్ని గనులు, విభాగాల్లో వారి పేర్లను నోటీసు బోర్డుపై ప్రదర్శించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలన్నారు.

**లక్షెట్టిపేట:** లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక సబ్‌జైలులో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అండర్ ట్రైన్స్ ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

**బెల్లంపల్లి:** పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య ప్రారంభించారు.

**జైపూర్:** వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సత్యనారాయణ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలతో బుధవారం సమావేశం నిర్వహించారు.

**చెన్నూరు:** అడవులు, ప్లాంటేషన్‌లు కాలితే పర్యావరణానికి నష్టమని అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్‌కుమార్ అన్నారు. చెన్నూరు మండలంలోని చాకెపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు.

## రాష్ట్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

### విద్యారంగానికి 20 శాతం కేటాయించాలి..

- డి శ్రీకాంత్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి బడ్జెట్‌లో కేవలం 7.57 శాతం కేటాయించడం సిగ్గుచేటు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్‌కు వత్తాసు పలికేలా బడ్జెట్ రూపకల్పన జరిగింది. తక్షణమే ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి 20 శాతం నిధులు కేటాయించాలి.

### నామ మాత్రపు బడ్జెట్...

- రంగు రాజేశం, కన్వీనర్ సామాజిక న్యాయ వేదిక



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బలహీనవర్గాల వారికి కేటాయింపులు నామ మాత్రంగానే ఉన్నాయి. బీసీ సంక్షేమశాఖకు కేవలం రూ. 11,405 కోట్లు కేటాయించడం కంటి తుడుపు చర్యగా ఉంది. అలాగే విద్యాశాఖకు రూ. 23వేల కోట్లు కేటాయించడం ద్వారా కీలక రంగాలపై అశ్రద్ధ చేశారు. రాహుల్‌గాంధీ ప్రవచిస్తున్న సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధంగా రాష్ట్ర పాలకులు ప్రవర్తించడం శోచనీయం.

### కేటాయింపులు ఏ మాత్రం సరిపోవు...

- శాంతికుమారి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



ప్రభుత్వం విద్యాశాఖకు కేటాయించిన బడ్జెట్ ఏ మాత్రం సరిపోదు. విద్యాశాఖ పరిధిలో ఉన్న 26,067 పాఠశాలలను ప్రభుత్వం గాలికి వదిలేసింది. రెసిడెన్షియల్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి మాత్రమే ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఆయా గురుకులాల్లో చదివేది 5.5 లక్షల మంది మాత్రమే. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో చదివే విద్యార్థులు 16 లక్షలు. వారిలో అత్యధికులు బడుగు బలహీన వర్గాల వారు. వీరికి నాణ్యమైన విద్యా అందించడానికి ఈ కేటాయింపులు ఏ మాత్రం సరిపోవు.

### ప్రజా సంక్షేమ బడ్జెట్...

- ఆదర్శ వర్ధన్ రాజు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసింది. గత సంవత్సరంతో పోలిస్తే అన్నిరంగాల్లో బడ్జెట్ కేటాయింపులు పెరిగాయి. విద్యా రంగానికి సైతం బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పించారు. గురుకులాల విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు పెంచడం శుభపరిణామం. ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి దోహదపడేలా బడ్జెట్ రూపకల్పన చేయడం గొప్ప విషయం.

### జిల్లాకు మొండి చేయి..

- వెర్రబెల్లి రఘునాథ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు



కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు మొండిచేయి చూపింది. జిల్లాలో ప్రభుత్వపరంగా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉండగా దాన్ని పరిగణలోకి తీసుకోలేదు. అలాగే మంచిర్యాల- అంతర్గాం బ్రిడ్జికి నిధులు కేటాయించకపోవడం శోచనీయం. బ్రిడ్జీ నిర్మాణం చేపట్టి ప్రజలకు మేలు చేకూర్చాలి. జిల్లా కేంద్రంలోని లక్ష్మీ టాకీస్ నుంచి రాజీవ్‌నగర్ మధ్య రైల్వే వంతెనకు హామీ ఇచ్చారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడం మరిచారు.

# అలరించిన విద్యార్థినుల నృత్యాలు






వీగాంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు, వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో కలిసి నృత్యాలు చేస్తున్న ఉపాధ్యాయినులు

భీమిని, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు అలరించాయి. భీమిని మండలంలోని వీగాం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణమూర్తి, ఎంపీడీవో గంగమోహన్, మాజీ ఎంపీటీసీ దుర్గం ప్రభాకర్, సీఆర్పీ దారిషెట్టి వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జైపూర్:** మండలంలోని ఇందారం ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమాదేవి, మంజుల, సంధ్యారాణి, పద్మ, విజయలక్ష్మీ, రమేష్, రమేష్‌బాబు, సత్తిరెడ్డి, చక్రధర్, నవీన్, రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

**దండేపల్లి:** దండేపల్లి వెల్గనూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, నరేందుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** మండలంలోని పొన్నారం పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయుడు దత్తుమూర్తి, ఉపాధ్యాయులు, సీఆర్పీ రాంచందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

బెజ్జూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జీసీడీవో శకుంతల అన్నారు. బుధవారం మండలంలోని కుంటలమానేపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 10 వరకు వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్నాయని విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా రాయాలని అన్నారు. ఆమె వెంట ఏటీడీవో కమర్, ప్రధానోపాధ్యాయుడు పశురాం, వార్డెన్ సునీత ఉన్నారు.



# బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

ఆసిఫాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన 2025- 26 బడ్జెట్‌పై మిశ్రమ స్పందన లభించింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క. రూ. 3,04,965 కోట్లతో వార్షిక బడ్జెట్ పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టారు. ప్రధానంగా ఎస్సీ సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ బడ్జెట్ కొత్త సంక్షేమ పథకాలకు దారులు వేస్తుందని భావించినా నిరాశే మిగిలింది. ప్రస్తు ప్రభుత్వం కొనసాగిస్తున్న పథకాలకు సంబంధించిన కేటాయింపులు మినహా భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాల ప్రస్తావన లేకుండా పోయిందని ఆయా వర్గాల ప్రజలు చెబుతున్నారు. బడ్జెట్ జనరంజకంగా ఉందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. బీఆర్ఎస్, ఇతర

- ఎస్సీ సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి అధిక నిధులు
- ఆసరా పింఛన్ల పెంపుపై ప్రస్తావన కరువు
- జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిపై అయోమయం

పార్టీల నాయకులు మాత్రం హామీల అమలును పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి అమలు చేస్తున్నా పథకాలపైనే కేటాయింపులు సాగాయి. కొత్త పథకాలు కొత్త ఉత్సాహాన్ని నింపలేక పోయిందనే విమర్శలు వచ్చాయి. ఆసరా పింఛన్ల పెంపు, మహిళలకు నెలనెలా 2,500 రూపాయలు అందజేసే విషయంలో బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావర కరువైంది.

### ● నిధులొస్తేనే..

జిల్లాలో పలు సమస్యలు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోడం లేదు. ఈ ఏడాదైన నిధులు మంజూరవుతాయని ప్రజలు ఆశతో ఉన్నారు. 2005లో ప్రారంభించిన జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు కాలువ ముంపు భూములు 108 ఎకరాలకు ఇప్పటి వరకు బాధిత రైతులకు పరిహారం అందలేదు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుకు శంకు స్థాపన చేసింది. అనంతరం డిజైన్ మార్చి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత నిర్మాణంపై కదలిక తెచ్చిన తరుణంలో రైతాంగం ఆశలు పెట్టుకుంది. కానీ బడ్జెట్‌లో దీనికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రస్తావన రాకపోడంతో సంశయం నెలకొంది.



### ● ఎస్సీ సంక్షేమానికి ..

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ రూ. 40,232 కోట్లు నిధులు కేటాయించింది. దీంతో జిల్లాలోని ఎస్సీల అభివృద్ధికి అధిక నిధులు వెచ్చించే అవకాశం ఉందని భావిస్తున్నారు. జిల్లాలో సుమారుగా 1.50 లక్షల మంది ఎస్సీ సామాజిక వర్గాలకు చెందినవారు ఉన్నారు. వీరిలో చాలా మంది నిరుపేదలు ఉన్నారు. ప్రభుత్వం బడ్జెట్‌లో బారీగా కేటాయించడంతో జిల్లాలో ఎస్సీ సామాజిక వర్గాలకు ప్రయోజనం చేకూరనుందని భావిస్తున్నారు. ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖకు రూ. 31,605 కోట్లు కేటాయించింది. దీంతో జిల్లాలోని గ్రామీణరోడ్లు నిర్మాణం చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో నేటికి రోడ్డు సౌకర్యంలేక చాలా గ్రామాలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నాయి. సుమారు 445 అవాస గ్రామాలకు రోడ్డు కనెక్టివిటి లేదని అధికారుల గణాంకాలే చెబుతున్నాయి. ప్రభుత్వం బడ్జెట్‌లో పంచాయతీరాజ్‌శాఖకు అధిక నిధులు కేటాయించడంతో జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రోడ్డు వసతి మెరుగుపడే అవకాశం ఉందని చెబుతున్నారు.

### అన్ని రంగాలకు పెద్దపీట



**- కె విశ్వప్రసాద్‌రావు, డీసీసీ అధ్యక్షుడు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాలకు పెద్దపీట వేసింది. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు ఇంతటి చక్కనైన బడ్జెట్‌ను చూడలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విస్మరించిన రంగాలకు ఈ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి సాయం లేకున్నా స్వతంత్రంగా ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రాష్ట్ర అభివృద్ధికి పాటు పడుతోంది.

### అంకెల గారడీ బడ్జెట్..



**- ఎ నాగేశ్వర్‌రావు, బీజేపీ నాయకుడు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ అంకెల గారడీలా ఉంది. ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ అవి పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడంలేదు. ప్రభుత్వం హామీలను విస్మరించింది. జిల్లాలోని కుమరంభీం, వట్టివాగు ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తున్నట్లు ఎక్కడా ప్రస్తావన లేదు.

### పెండింగ్ బిల్లుల ప్రస్తావన రాలేదు..



**- రవీందర్, బీఆర్ఎస్ నాయకుడు**

బడ్జెట్‌లో పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రస్తావన రాలేదు. మహిళలకు రూ. 2500 చెల్లింపు, తులం బంగారం పథకం అమలు ఊసే ఎత్తలేదు. నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కూటీల పంపిణీలకు కేటాయింపులు బడ్జెట్‌లో లేవు. మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మా రింది. వారిని అదుకుంటామని గతంలో హామీ ఇచ్చినా ప్రస్తావనే లేదు.

### దివ్యాంగులకు పింఛన్ పెంపు లేదు



**- ఇస్లాంబీన్ హసన్, దివ్యాంగుల సంఘం నాయకుడు**

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగులకు పెన్షన్ పెంపు ప్రస్తావన రాలేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దివ్యాంగులను మోసం చేసింది. అధికారంలోకి వచ్చిన నెలలోనే 6వేల రూపాయలు ఇస్తామని చెప్పినా ఇప్పటికీ పెంచలేదు. దివ్యాంగులకు ఇచ్చిన హామీని విస్మరించారు.

### కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్..



**- బోగే ఉపేందర్, సీపీఐ నాయకుడు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్‌ల ఉంది. స్కీం వర్కర్ల వేతనాల పెంపు ఊసేలేదు. ఆర్టీసీకి నిధులు కేటాయించలేదు. ఎస్పీఎం ఊసేత్తలేదు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత మాటలేదు.

### విద్యా రంగానికి 7.5 శాతమే నిధులు..



**- కె ఊశన్న, ఉపాధ్యాయ సంఘం నాయకుడు**

వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి 7.5 శాతం నిధులు మాత్రమే కేటాయించారు. వాస్తవానికి 10 శాతం దాటాలి. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 15 శాతం ఇస్తామని సగమే కేటాయించారు. కేటాయింపులనీ తప్పకుండా అమలు చేస్తే పాఠశాలలు అభివృద్ధికి నోచుకుంటాయి. ఖర్చు చేయకపోతే మళ్లీ సమస్యలు అలానే పురుకుపోతాయి.

## గర్భిణులు టీకా తీసుకోవాలి

వాంకిడి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు టీకా తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యాధికారి వినయ్ అన్నారు. ఇందాని గ్రామంలో బుధవారం నిర్వహించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పిల్లలకు, గర్భిణులకు అం దిస్తున్న టీకా వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్, సిబ్బంది మమత, కాంత, భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ కమిటీ ఎన్నిక

కౌటాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుడుపేట శివ ఆంజనేయ ఆలయ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వసంత్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశం, ప్రధాన సలహాదారుగా రామయ్య, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, గౌరవ అధ్యక్షుడిగా మల్లయ్య ఎన్నికయ్యారు.

## విద్యార్థులు జాతీయ సమైక్యతను పెంపొందించాలి

పెంచికలపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జాతీయ సమైక్యతను పెంపొందించాలని ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయురాలు విజయ నిర్మల ఆధ్వర్యంలో ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా తెలంగాణ, హరియాణా రాష్ట్రాలను జత చేశారని ఆమె విద్యార్థులకు వివరించారు. మన రాష్ట్రం లోని విద్యార్థులకు కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాషా, గంగాభవాని, లక్ష్మి, ఆఫ్తాబ్, ఈశ్వర్ రావు, సంతోష్, ధన్‌రాజ్, భారతి, ఆత్మారాం, సాదీయా, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

బెజ్జూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగవెల్లి గ్రామానికి చెందిన ఆత్రం అశోక్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. ఆయన వెంట బషరత్‌ఖాన్, సకారాం, వెంకన్న, సత్తన్న, సాయి, తిరుపతి తదితరులు ఉన్నారు.

## మహిళకు తీవ్ర గాయాలు

బెజ్జూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన రేస సత్యభాయిని ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యబాయి బుధవారం పని నిమిత్తం బ్యాంకుకు వెళ్లి ఇంటికి వెళ్తున్న క్రమంలో వెనక నుంచి ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్య సిబ్బంది సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు.

## పరీక్షా సామగ్రి పంపిణీ

కౌటాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, కంపాక్స్ తదితరాలను హెచ్ఎం అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై మధుకర్ బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, రవికిరణ్, సంతోష్, లాహు, రవీందర్, ఎస్‌సీఆర్పీ పోచాని తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన సదస్సు

సిర్పూర్(టి), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార సంఘం బ్యాంకులో బుధవారం నాబార్డు సౌజన్యంతో డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీఎం వీరభద్రం మాట్లాడుతూ ప్రతి రైతు డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలన్నారు. దీంతో రైతులకు దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహకార మేనేజర్ ఫిర్దోజ్ తబసుం, సీఈఓ రాకేష్, కళాజాత బృందం సభ్యులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులు

సిర్పూర్(టి), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) కోర్టు బార్ అసోసి యేషన్ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా మహ్మద్ రైయిస్ అహ్మద్, అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా దయారాజ్‌సింగ్, గణపతి, ప్రధాన కార్యదర్శిగా కళ్యాణ్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా సతీష్‌కుమార్, సాంస్కృతిక కార్యదర్శుల ుగా దివాకర్, విజయ్‌ను ఎన్నుకున్నారు.

## అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ అయ్యప్ప ఆలయ వార్షికత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చండి హోమ, పడిపూజ, అష్టాదశ కలశపూజ కార్యక్రమాలు నిర్వహించారు. గురుస్వామి భిక్షపతి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## తాగునీరు అందించాలని వినతి

చింతలమానేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బా, బారెగూడ గ్రామంలో తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శికి బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎస్ యూత్ వెల్ఫేర్ సోసైటీ సభ్యులు శ్రీనివాస్, అశోక్, సంతోష్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దహెగాం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం చిన్న రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉచిత పాఠశాలలో మంగళవారం రాత్రి పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై రాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవి ఉత్తమ ఫలితాలు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ రాయితీపై అవగాహన కల్పించాలి

కాగజ్‌నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ 2020 పథకంలో క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు సదరు అభ్యర్థులు వంద శాతం రుసుము చెల్లించినట్లయితే అందులో 25 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ విషయమై అర్హత కలిగిన ప్రతి అభ్యర్థులకు సమాచారం అందించి సకాలంలో రుసుము చెల్లించే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పది విద్యార్థులు రాసే పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు ఈ నెల 21 నుంచి ప్రారంభమవుతున్నట్టు తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.




కాగజ్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

### దివ్యాంగులు వినియోగించుకోవాలి

**ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి):** దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకుని ముందుకు సాగాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, అలింకో సంయుక్తంగా సమకూర్చిన దివ్యాంగులకు పరికరాలను పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లా డారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ మధుకర్, అలింకో ఇన్‌చార్జి గౌరవ్, ఫైనాన్షియల్ అధికారి దేవాజీ, పరీక్షల సహాయ కమిషనర్ ఉదయభాను పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



కాగజ్‌నగర్‌లో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లును చేపట్టిన సందర్భంగా రాజీవ్‌గాంధీ చౌరస్తాలో బుధవారం సిర్పూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం వర్గీకరణ బిల్లును ఆమోదింప చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని కొనియా డారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, రాజీవ్ యువ వికాసం బిల్లు ఆమోదం తెలుపడంతో బుధవారం కాంగ్రెస్‌పార్టీ, బీసీ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షారాభిషేకం చేశారు. పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో, అంబేద్కర్‌చౌక్‌లో సీఎం, డిప్యూటీ సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు వేర్వేరుగా క్షీరాభిషేకం చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్యాంనాయక్, నాయకులు చరణ్, మల్లేష్, నిజాం, మురళీ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేస్ తదితరులు పాల్గొన్నారు.

**కెరమెరి, (ఆంధ్రజ్యోతి):** బీసీ రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా కెరమెరిలో కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కుసుంరావు, మునీర్ అహ్మద్, బాపురావు, తిరుపతి, నగేష్, హన్మంతు, శంకర్, ముకుందరావు, గిడ్డప్ప, వెంకటస్వామి, విట్టు, తిరుపతి, లింబరావు, నానేశ్వర్, జలపత్‌రావు, జగన్నాథ్‌రావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## పోరాటం ఫలించింది

బెజ్జూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం తాము చేసిన మూడు దశాబ్దాల పోరాటం ఫలించిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదించడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, తిరుపతి, శ్రీను, వెంకటేష్, శంకర్, మహేష్, అనీల్, సునీల్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.